సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 11 । మే । 2024



టీడీపీని వీడి..

టీడీపీని వీడి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎన్నికల ముందు ఇది జోష్ పెంచింది. -VIIIలో



అవకాశమివ్వండి..

తనకు అవకాశమిస్తే అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. 'సాక్షి'తో మాట్లాడారు. -VIIIలో

'ఖైదీలకు ఉచిత న్యాయసహాయం'

గార: ఖైదీలకు వారి కేసుల కోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులను నియమిస్తుందని, ఉచితంగా ఈ సేవ అందిస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా కారాగారాన్ని ఆయన సందర్శించారు. ఖైదీల వసతులను అడిగి తెలుసుకోవడంతో పాటు పరిశీలించారు. ఆయన వెంట కేవీ రమణ, జైలర్లు ఉదయ భాస్కర్, దివాకర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

'ఉచిత సీట్లలో చేరేందుకు 20వరకు గడువు పెంపు'

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్/ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఉచిత అడ్మిషన్లు లభించిన విద్యార్థులు వారు ఎంపికైన పాఠశాలల్లో చేరేందుకు ప్రభుత్వం ఈనెల 20వ తేదీ వరకు గడువు పెంచిందని సమగ్రశిక్ష శ్రీకాకుళం జిల్లా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం 3,185 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. మొదటి దశలో 796 మంది విద్యార్థులు ఎంపికైన విషయం తెలిసిందే. ఇప్పటికీ మరికొద్ది మంది విద్యార్థులు ప్రవేశాలు పొందలేదని, వాస్తవానికి ఈనెల 10వ తేదీలోపు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు గడువు ముగియగా.. ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈనెల 20 వరకు గడువు పెంచినట్టు ఏపీసీ డాక్టర్ జయప్రకాష్ వెల్లడించారు. గడువు పెంచిన విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. సంబంధిత ప్రైవేటు పాఠశాలలు యాజమాన్యాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంపికైన విద్యార్థులను చేర్చుకోవాల్సిందేనని, అడ్మిషన్ల కోసం ఎలాంటి అదనపు ఫీజులు వసూలు చేయడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు పూర్తి చేసిన విద్యార్థుల వివరాలతో ఒక రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు.

ఘనంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి



నైటింగేల్‌కు నివాళులు అర్పిస్తున్న వైద్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మోడర్న్ నర్సింగ్ ఆద్యురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కళావతి మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను కొనియాడారు. ముందుగా నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్.సాయిరాం, ఎం.మోబెల్, డి.ఉషా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్ తెలిపారు. ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈ మేరకు విజయవాడకు చెందిన ఉపాధి, శిక్షణ శాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 10వ తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. దరఖాస్తులు చేసుకున్నాక ప్రభుత్వ కళాశాలల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సెట్ అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ ముగిశాక కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించనున్నట్లు తెలిపారు. మొత్తం మూడు ప్రభుత్వ ఐటీఐల్లో 760, ప్రైవేట్ ఐటీఐల్లో 3056 సీట్లు ఉన్నట్లు చెప్పారు. దరఖాస్తు సమయంలో విద్యార్థులు 10వ తరగతి మార్కులు మెమో, కుల, ఆదా య, ఆధార్, బదిలీ ధ్రువీకరణలు, ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుందని అన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఎచ్చెర్ల క్యాంపస్ ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని శ్రీకాకుళం డీఎస్పీ శృతి అన్నారు. బొంతలకోడూరులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణలు చోటుచేసుకున్నా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గొడవల్లో పాల్గొంటే యువత భవిష్యత్తు నాశనమవుతుందని, ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసుకోవాలని పిలుపునిచ్చారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎన్నికలు ప్రచారం నిర్వహించవద్దని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ జి.రామచంద్రరావు, ఎస్సై ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శృతి



ఓ పేదింటి విద్యార్థి స్కూల్‌కు వెళ్లిన మొదటి రోజే పుస్తకాలు, దుస్తులు, షూ, బెల్టు ఓ బ్యాగులో పెట్టి విద్యా కానుక అందించడం.. ఆ పిల్లాడికి మధ్యాహ్నం పూట ఆరోగ్యకరంగా, రుచికరంగా 'గోరుముద్ద'లు పెట్టడం, ఆ విద్యార్థి చదువుకు ఇంటి వారు ఇబ్బంది పడకుండా 'అమ్మ ఒడి' అందించడం, స్కూల్‌ను నాడు–నేడు పోల్చుకుని చూసేలా బాగు చేయించడం.. సీఎం వైఎస్ జగన్ చేసిన సంస్కరణలివి. ఉన్నత విద్యలోనూ పేదింటి పిల్లలను ప్రోత్సహించేలా విద్యాదీవెన, వసతి దీవెన అందిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటుతో నిరుపేదల ఇళ్లలో చదువుల దీపాలు ప్రకాశిస్తున్నాయి. కుటుంబాలను వెక్కిరిస్తున్న పేదరికాన్ని దూరం చేసేలా అడుగులు వేస్తున్నాయి.



చదువుల బడిలో సంస్కరణల విప్లవం

- విద్యాభివృద్ధికి వందల కోట్లు ఖర్చు చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో పెరిగిన విద్యా ప్రమాణాలు
- జిల్లాలో నూతన విద్యా సంస్థల ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:


బడిపై సర్కారు పెడుతున్న పెట్టుబడి నిరుపేదల తలరాతలు మారుస్తోంది. ఇన్నాళ్లూ వెక్కిరింపులకు గురైన వీధి బడి చదువులను కార్పొరేట్ స్థాయికి చేర్చింది. ఒకప్పుడు శ్రీకాకుళం విద్యలో వెనుకబడి ఉండేది. ఈ గడ్డపై పుట్టిన ఎంతో మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఐఆర్ఎస్‌లు, ఐఎఫ్ఎస్‌లు, వైద్యులు, ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. కానీ పేదింటి పిల్లలకు అంతగా అవకాశాలు రాలేదు. కానీ వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆ అవస్థ తొలగిపోయింది. ఉన్న విద్యా సంస్థలను బాగు చేయడం, కొత్త సంస్థలను ఏర్పాటు చేయడం, విద్యార్థులకు ఆర్థికంగా, హార్దికంగా ఆదుకోవడంతో చదువుల విప్లవం చక్కగా సాగుతోంది.

కొత్త విద్యా సంస్థలు

- సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేశారు. దానికి సంబంధించిన తాత్కాలిక క్లాసులు దన్నానపేట ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహిస్తున్నారు.
- ఆమదాలవలస మండలం తొగరాంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేశారు. తరగతులు కూడా ప్రారంభమయ్యాయి.
- బూర్జ మండలం పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యాయి.
- వైఎస్సార్ కలల విద్యా సంస్థ ట్రిపుల్ ఐటీలో గత ప్రభుత్వంలో కేవలం 2వేలలోపు పరిమితమైన అడ్మిషన్లు ఇప్పుడు 4వేలకు పైగా దాటాయి. 2024నాటికి 6600మందికి సీట్లు లభించేలా ట్రిపుల్ ఐటీ సిద్ధమవుతోంది. టీడీపీ ప్రభుత్వం కేవలం రూ. 43కోట్లు పెట్టి అరకొర నిర్మాణాలు చేపట్టగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 131కోట్లతో మూడు జీప్లస్5 బ్లాక్‌లను నిర్మించింది. ప్రస్తుతం రూ. 67కోట్లతో న్యూ అకాడమీ బ్లాక్‌ను ప్రస్తుతం నిర్మిస్తోంది. మరో రూ.133కోట్లతో 6వేల మందికి సరిపడా వసతి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది.
- జిల్లాకే తలమానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రూ. 45కోట్లతో మరిన్ని భవనాలను నిర్మిస్తోంది.
- పొందూరులో డిగ్రీ కళాశాల మంజూరు చేశారు. తరగతులు ప్రారంభమయ్యాయి.
- ఆమదాలవలస మండలం తొగరాంలో డిగ్రీ కళాశాల మంజూరు చేశారు. తరగతులు ప్రారంభమయ్యాయి.
- పొందూరులో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ బాలురు పాఠశాల మంజూరు చే శారు. తరగతులు కూడా ప్రారంభమయ్యా యి.
- సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో బాలికల జూనియర్ కళాశాల మంజూరు చేశారు. తరగతులు ప్రారంభమయ్యాయి.
- ఆమదాలవలస కేజీబీవీ బాలికల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు.
- పలాసలో ఇప్పటికే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు.

పిల్లల భవిష్యత్ కోసం

విద్యార్థుల భవిష్యత్ కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. నాడు–నేడు కింద బడులను బాగు చేశారు. చదువుల్లో నాణ్యత పెంచారు. పిల్లలను బడికి పంపించేందుకు అమ్మ ఒడి కింద తల్లులకు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఉన్నత విద్య కోసం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద ఆర్థికంగా అండగా ఉంటున్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులు బలంగా, ఆరోగ్యవంతంగా ఉండేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఉండే నాసిరకమైన మెనూకు బదులు రుచితోపాటు అనేక పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించేలా మెనూను సమూలంగా మార్పులు చేశారు. 2023 మార్చి 11 నుంచి రాగీమాల్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కేవలం మధ్యాహ్నం భోజనం అందించేందుకు జిల్లా వ్యాప్తంగా 4747 మంది పనిచేస్తున్నారు.



జగనన్న అమ్మఒడి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	జమ చేసిన సొమ్ము (రూ.కోట్లలో)
2020	2,39,902 (38 మండలాలు)	359.85
2021	2,39,692 (38 మండలాలు)	359.54
2022	1,95,358 (30 మండలాలు)	293.37
2023	1,90,500 (30 మండలాలు)	285.75
2024	జూన్‌లో ఇవ్వాల్సి ఉంది	



జగనన్న విద్యా దీవెన (జేవీడీ)

సంవత్సరం		లబ్ధిదారులు	సొమ్ము (రూ.కోట్లలో)
2020–21	మొదటి విడత	67,653	31.91
	రెండో విడత	67,940	32.97
	మూడో విడత	67,615	32.49
2021–22	మొదటి విడత	68,913	32.36
	రెండో విడత	59,192	31.16
	మూడో విడత	57,672	29.89
	నాలుగో విడత	61,219	33.68
2022–23	మొదటి విడత	48,345	31.40
	రెండో విడత	44,301	36.73
	మూడో విడత	51,337	33.07



జగనన్న వసతి దీవెన

సంవత్సరం	లబ్ధిదారులు	సొమ్ము (రూ.కోట్లలో)
2020–21	64,623	రూ. 62.33
2021–22	55,429	రూ.62.85
2022–23	50,985	రూ. 47.85

జగనన్న గోరుముద్ద

జిల్లాలో ప్రభుత్వ బడుల్లో జగనన్న గోరుముద్ద తింటున్న విద్యార్థులు

పాఠశాల స్థాయి	బడుల సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	1915	73967
ప్రాథమికోన్నత	332	36344
ఉన్నత	333	91911



మనబడి నాడు-నేడు

జిల్లాలో నాడు–నేడు మొదటి ఫేజ్ కింద 1247 పాఠశాలను సుందరంగా తీర్చి దిద్దారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 286.22 కోట్లు వెచ్చించింది. ఫేజ్–2 కింద పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, వసతి గృహాలు ఇలా 1096 విద్యాసంస్థలను తీర్చిదిద్ది, అదనపు తరగతి గదులను నిర్మించి, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఇందుకోసం రూ.427.73 కోట్లు కేటాయించారు.





ట్యాబ్‌ల పంపిణీ

సంవత్సరం	ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు
2022–23	25,953
2023–24	22,318

జగనన్న విద్యాకానుక

సంవత్సరం	లబ్ధిదారులు
2020–21	2,49,405 (38 మండలాలు)
2021–22	2,71,559 (38 మండలాలు)
2022–23	2,75,334 (38 మండలాలు)
2023–24	1,91,394 (30 మండలాలు)

విద్యలో సమూల మార్పులు..

- ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధనతో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి.
- ఇంగ్లిష్ మీడియంలో బోధన, సీబీఎస్సీ సిలబస్ ప్రవేశంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు సైతం ప్రభుత్వ బడులపై ఆకర్షణ పెరిగింది.
- కరిక్యులంలో మార్పులు చేయడంతోపాటు మిర్రర్ ఇమేజ్ లో పాఠ్యపుస్తకాల ముద్రణతో సులువుగా అర్థం చేసుకునే అవకాశం.
- దాదాపుగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 4కె డిజిటల్ టీవీలతో ఆడియో, వీడియో క్లాసులను నిర్వహిస్తున్నారు.

అశోక్ ఇదా నీ రాజకీయం



సంధికొత్తూరు గ్రామంలో ఉపసర్పంచ్ కొల్లి గోపయ్య ఇంటిమీద దాడికి పాల్పడుతున్న టీడీపీ నేతలు

- యాదవ సామాజిక వర్గ నేతపై టీడీపీ గూండాల దాడి



కొల్లి గోపయ్య

సోంపేట/కంచిలి: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆగడాలు కొనసాగించారు. పచ్చటి పల్లెలో కక్షలు రగిలించి రాజకీయ లబ్ధి పొందాలనే రాక్షస రాజకీయ సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించారు. ఇన్నాళ్లూ ఏ పార్టీ తరఫున ఆ పార్టీ నాయకులు ప్రశాంతంగా ప్రచారం చేసుకుంటూ ఉంటే.. అశోక్ మాత్రం తన నైజం చూపించారు. తాను ఎమ్మెల్యే స్థానంలో ఉండి కూడా తన పార్టీ కార్యకర్తలతో ఓ యాదవ సామాజిక వర్గ నాయకుడిపై దాడి చేయించారు. సోంపేట మండలం కర్తలిపాలెం పంచాయతీ పరిధి సంధికొత్తూరు గ్రామంలో గురువారం సాయంత్రం నిర్వహించిన టీడీపీ ఎన్నికల ర్యాలీలో వైఎస్సార్ సీపీ నేత ఇంటిపై టీడీపీ రౌడీమూకలు మూకుమ్మడిగా దాడి చేశాయి. ఆయన ఇంటిలోకి చొరబడి విధ్వంసకాండ సృష్టించాయి. దాడిలో యాదవ సామాజిక వర్గం నేత, ఉపసర్పంచ్ కొల్లి గోపయ్య, ఉలాల తిరుపతి, పోగల ఈశ్వరరావు గాయపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉండి అశోక్ కనబర్చిన రాజకీయ పరిణితి ఇదేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తమ నాయకుడికి జరిగిన అవమానంపై యాదవ సామాజిక వర్గానికి చెందిన వారంతా భగ్గుమంటున్నారు.

దాడి అమానుషం: మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

వైఎస్సార్ సీపీకి చెందిన యాదవ సామాజిక వర్గ నేత, ఉపసర్పంచ్ కొల్లి గోపయ్య, మరో ఇద్దరుపై టీడీపీ రౌడీ మూకలు దాడి చేయడం అమానుషమని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తీవ్రంగా ఖండించారు. గాయపడిన వారిని ఆయన పరామర్శించారు. పదేళ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు నువ్వు ఇచ్చిన బహుమతి ఇదా అని అశోక్ తీరును దుయ్యబట్టారు. అహంకారం, అహంభావానికి ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పి ఓడిస్తారని అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం యాదవులు తప్పనిసరిగా అశోక్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇస్తారని అన్నారు. యాదవులే లక్ష్యంగా ఎమ్మెల్యే దాడికి ఉసిగొల్పారని అన్నారు. సంధికొత్తూరులో ఉన్న కీలక నేతలను భయపెట్టి గ్రామంలో లేకుండా చేస్తే గుంపగుత్తగా ఓట్లు వేయించుకోవచ్చన్న కుట్రతో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లపై దాడిచేయించారని అన్నారు. ఎమ్మెల్యే అశోక్ దగ్గరుండి దాడి చేయించడం ఆయన తీరును కనబరుస్తుందన్నారు. పోలీసులు ఎమ్మెల్యే అశోక్‌పైన కూడా కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సారవకోట: కుమ్మరిగుంటలో ఎన్నికల ప్రచారంలో ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- పతాక స్థాయిలో..

ప్రచార పర్వం పతాక స్థాయికి చేరుకుంది. గెలుపే ధ్యేయంగా అభ్యర్థులు చక్కటి ప్రణాళికతో ఊళ్లన్నీ కలియదిరిగారు. మేనిఫెస్టోను వివరిస్తూ ప్రజల మనసులు గెలుచుకుంటున్నారు.





ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ కోరుతున్న పిరియా విజయ



సరుబుజ్జిలిలో ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాంపై పూలజల్లు కురిపిస్తున్న జనం



ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్



శ్రీకాకుళంలోని ప్రచారంలో ర్యాలీగా వెళ్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



వజ్రపుకొత్తూరు రూరల్: ఒంకులూరులో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు




ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

'ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల విధులు సమర్థంగా, విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సెక్టోరియల్ అధికారులు, తదితరులతో ఎన్నికల సన్నద్ధతపై శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ ఉండాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు మెయిన్ కంట్రోల్ రూమ్‌కు వెబ్ కాస్టింగ్ శనివారం ట్రయల్ వేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి ఏర్పాట్లు చేయాలని, వర్షం వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మాక్ పోల్, బ్యాలెట్ పేపర్ల పంపిణీ, ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలు, లైటింగ్ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లు, వాహనాలపై ఫ్లెక్సీ ఏర్పాట్లు, డిస్పాచ్ సెంటర్ల వద్ద పార్కింగ్ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. సెక్టార్ వారీగా బస్సులు పెట్టుకోవాలని సూచించారు. వెబ్ కాస్టింగ్ ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. జీపీఎస్ వాహనాల కేటాయింపుపై సమీక్షించారు. ర్యాండమైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీసీలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, నోడల్ అధికారులు జయ ప్రకాష్, వాసుదేవరరావు, బి.శాంతి శ్రీ, సుధ, తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో టెక్కలి రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు డాక్టర్ భరత నాయక్, దొర, అప్పారావు, రామ్మోహనరావు, సీహెచ్ రంగయ్య, లక్ష్మణమూర్తి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల స్వచ్ఛంద సేవకులకు దిశానిర్దేశం

శ్రీకాకుళం క్రైమ్ : ఈనెల 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి స్వచ్ఛందంగా సేవలు అందించే వారికి పోలింగ్ రోజున నిర్వర్తించాల్సిన విధి విధానాలు, నియమ నిబంధనలపై ఎస్పీ జీఆర్ రాధిక దిశానిర్దేశం చేశారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎన్‌సీసీ కమాండెంట్లు, కో ఆర్డినేటర్లు, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు, వలంటీర్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లతో వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించారు. విధుల్లో జాగ్రత్తలు, పోలింగ్ స్టేషన్ భద్రతా సిబ్బందితో సమన్వయంతో పనిచేయడం వంటి పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

క్లుప్తంగా

కూర్మనాథుని కల్యాణానికి పందిరిరాట


పందిరి రాట వేస్తున్న దృశ్యం

గార: మండలంలోని శ్రీకూర్మంలో కూర్మనాథుని కల్యాణోత్సవానికి శుక్రవారం పందిరాట వేశారు. శుద్ధ తదియ సందర్భంగా ప్రధాన ఆలయం వద్ద ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ నెల 19న వైశాఖ ఏకాదశి పర్వదినం నాడు స్వామి కల్యాణోత్సవం జరగనుంది. ఉదయం విశ్వక్షేన పూజ వంటి వైదిక క్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, లక్ష్మణాచార్యులు, కిషోర్‌బాబు, దాసుబాబు, శ్రీమన్నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలకు చెంపపెట్టు


ధర్మాన పద్మప్రియ

పోలాకి: డీబీటీ ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించే విషయంలో హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి పార్టీల కుట్రలకు కోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని పేర్కొన్నారు. టీడీపీ ఫిర్యాదు తో చేయూత, ఈబీసీ నేస్తం, ఆసరా, విద్యాదీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి పేదలకు దూరంచేయాలని ఎన్నికల కమిషన్ ద్వారా ప్రయత్నం జరిగిందని గుర్తుచేశారు. దాదాపు రూ.14,165 కోట్లు పేదల అందేలా కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటం శుభపరిణామమని పేర్కొన్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్టేట్‌హోమ్‌లో మహిళలకు మంచి వసతులు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో స్టేట్‌హోమ్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్‌హోమ్‌లో మహిళలకు సరైన వసతి సౌకర్యాలు అందించాలని, పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి.రమణ, స్టేట్ హోం ఆఫీసర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మేలు


జి.వి.వి.గణేష్ నాయుడు

పోలాకి: భూవివాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఎంతగానో తోడ్పడుతుందని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జి.వి.వి.గణేష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీతిఆయోగ్ సిఫారసుల మేరకే ఈ డ్రాఫ్టు రూపొందిందని తెలిపారు. ఏపీ అసెంబ్లీలో సదరు బిల్లుకు బేషరతుగా మద్దతు పలికిన టీడీపీ.. ఎన్నికల సమయంలో వ్యతిరేకంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రైతాంగాన్ని, భూహక్కుదారులకు భయపెట్టడం తప్ప ఇందులో ఎలాంటి నష్టం లేదని తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా సమగ్ర భూసర్వే నిర్వహించిన తర్వాతే సదరుచట్టం అమలు జరుగుతుందని, న్యాయనిపుణులు, మేధావులు, రెవెన్యూ అధికారుల సలహాలు, సూచనలు తర్వాతే ఇక్కడా అమలు చేస్తామని సీం జగన్ చెప్పారని గణేష్‌నాయుడు గుర్తుచేశారు.

ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలకు శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు

రణస్థలం: ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలు పొందేందుకు ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులకు ఉచితంగా ఆరు నెలలు శిక్షణ ఇస్తున్నామని అరబిందో కార్పొరేట్ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్.బి.రాజు తెలిపారు. రణస్థలం మండలం వరిసాం సమీపంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న 10వ బ్యాచ్ చెందిన 30 మంది విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెస్సీ చదివి ఎంపికైన విద్యార్థులకు ఫార్మాస్యూటికల్ క్వాలిటీ కంట్రోల్ అనలైటికల్ టెక్నిక్స్‌పై ఆరు నెలలు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల ఫార్మా రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందడం సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఆపరేషన్స్ మదన్‌కుమార్, యూని ట్ హెచ్‌ఆర్ హెడ్, సీనియర్ జనరల్ మేనేజర్ కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, దుంపల రామారావు, డి.పి.దేవ్, రాజాపు హైమవతి, అప్పన్న

- ప్రజాద్రోహి చంద్రబాబును ప్రజలు నమ్మరు
- మేనిఫెస్టోలో హామీలన్నీ అమలు చేసింది జగన్ ఒక్కరే
- విలేకరుల సమావేశంలో కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్లు శ్రీకాంత్, సూరిబాబు, రామారావు, డి.పి.దేవ్, హైమావతి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా, అడుగడుగునా అడ్డుపడుతున్న పేద ప్రజల ద్రోహిగా చంద్రబాబునాయుడు చరిత్రలో మిగిలిపోతారని రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు ధ్వజమెత్తారు. బీసీల పక్షపాతి సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అట్టడుగువర్గాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంతగానో కృషి చేశారని చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

➺ తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. వారి ఆదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు సీఎంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ఒక కూటమి కాదు వంద కూటములు వచ్చినా జగనన్నను ఓడించలేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో డీబీటీ ద్వారా ప్రజలకు అందాల్సిన రూ.10 వేల కోట్లను అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్రలో తూర్పుకాపులకు ఉన్నత గౌరవమిచ్చిన జగనన్నను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

➺ కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట వేశారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 100 స్థానాల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా నియమించిన గొప్ప దార్శనీకుడు జగన్ అని పేర్కొన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అందులో 60 శాతానికి పైగా చైర్మన్లను ఎస్సీ, ఎస్టీ, బీసీలను నియమించిన గొప్ప మానవతావాది అని చెప్పారు. 2019 మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98.5 శాతం పూర్తి చేసిన గొప్ప పాలనాదక్షుడు అని వివరించారు.

➺ కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు మాట్లాడుతూ బీజేపీతో కుమ్మక్కై చంద్రబాబు దుర్మార్గ ఆలోచనల వల్ల రెండు నెలలుగా వృద్ధులు, పేదలు రోడ్డున పడి ఇబ్బందులు పడ్డారని మండిపడ్డారు. మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా పేదలకే సంక్షేమ పథకాలు అందజేసిన జగనన్నను గెలిపించుకునేందుకు పేదలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో పేదలంతా జగన్ పక్షానే ఉన్నారని పేర్కొన్నారు.

➺ శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్‌కు చెందిన కరపత్రం చూపించి జగన్ ఫొటో ఉందని దానిని కాల్చడం, చించడం సభ్యత కాదన్నారు. టైటిలింగ్ చట్టం అమలు చేయకముందే భూములు లాక్కుంటున్నారని బురద జల్లడం ప్రతిపక్షాల కుట్రగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. చంద్రబాబు ఇచ్చే మానిఫెస్టోకు రూ.లక్షల కోట్లు అప్పు చేయాల్సి వస్తుందన్నారు.

➺ పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, పొందర కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజాపు అప్పన్న మాట్లాడుతూ పొందర కులస్తులను 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఓసీల నుంచి బీసీలుగా మార్చారని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ మోహనరెడ్డి పొందర, కూరాకుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌గా నియమించి తమ సామాజికవర్గానికి గౌరవం కల్పించారని పేర్కొన్నారు.

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా..

- సీఎం జగన్‌కు జిల్లాపై ఎంతో మమకారం
- రెండు సార్లు ఎంపీగా చేసిన రామ్మోహన్‌నాయుడు నిర్లక్ష్యం చేశారు
- 'సాక్షి'తో శ్రీకాకుళం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్





రెండు సార్లు ఎంపీగా చేసిన టీడీపీ నేత కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేవలం పదవిని ఎంజాయ్ చేశారు తప్పా జిల్లాను ఎటువంటి అభివృద్ధి చేయలేదని శ్రీకాకుళం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. ఎటువంటి ఆర్థిక బలం లేని తనకు ప్రజాబలాన్ని అంచనా వేస్తూ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని, జిల్లా ప్రజలంతా ఒక్క అవకాశమిస్తే జిల్లాలో అన్ని రంగాలను మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. శుక్రవారం 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. - టెక్కలి

ప్ర: జిల్లాకు సీఎం జగన్ ఎటువంటి అభివృద్ధి చేశారు?

జ: టీడీపీ నాయకులంతా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతూ జిల్లా అభివృద్ధిని పూర్తిగా పక్కకు నెట్టేశారు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఆనాడు వైఎస్సార్ హయాంలో జిల్లాలకు రిమ్స్ కళాశాల, అంబేడ్కర్ యూనివర్శిటీ, వంశధార ఆధునీకరణ, ఆఫ్‌షోర్ ప్రాజెక్టుతో పాటు ఎంతో అభివృద్ధి చేశారు. ఆ తరువాత ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సుమారు రూ.4361.91 కోట్లతో మూలపేట పోర్టు, రూ.365.81 కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్, మంచినీళ్లపేటలో రూ.11.95 కోట్ల రూపాయలతో జెట్టీ నిర్మాణం, పలాసలో రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఉద్దానం ప్రాంతానికి మంచినీటి కోసం రూ.800 కోట్లతో వైఎస్సార్ సుజలధార పథకం, ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో రూ.131 కోట్ల తో భవనాలు, రూ.133 కోట్లతో వసతి భవనాలు, అంబేడ్కర్ యూనివర్శిటీ లో రూ.45 కోట్లతో భవనాలు, నందిగాంలో రూ.11 కోట్లతో విత్తనోత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేశారు.

ప్ర: రెండు సార్లు ఎంపీగా చేసిన రామ్మోహన్‌నాయుడు జిల్లాకు ఏం చేశారు?

జ: యువకుడు అనే ఉద్దేశంతో జిల్లా ప్రజలంతా రామ్మోహన్‌నాయుడుకు రెండు సార్లు ఎంపీగా అవకాశమిచ్చారు. ఆయన మాత్రం ఢిల్లీలో ఎంజాయ్ చేసుకున్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం అభివృద్ధికి ఖర్చు చేయలేని అసమర్థునిగా మిగిలిపోయారు. ఊకదంపుడు ప్రసంగాలతో ప్రజలను మభ్యపెట్టడమే తప్ప జిల్లా అభివృద్ధిని పట్టించుకోలేదు. ఆయన తండ్రి దివంగత ఎంపీ ఎర్రన్నాయుడు అదే నిర్లక్ష్యం చూపారు.

ప్ర: మీకు ఎంపీగా అవకాశం ఇస్తే ఎలాంటి అభివృద్ధి చేస్తారు?

జ: జిల్లాలో అపారమైన అభివృద్ధి వనరులు ఉన్నాయి. ఎంపీగా గెలిపిస్తే ఉద్దానం కొబ్బరి పరిశ్రమలు, పలాస జీడి పరిశ్రమలు, టెక్కలిలో గ్రానైట్ రంగం, పొందూరు ఖాదీ పరిశ్రమలు, ఆమదాలవలసలో షుగర్ ఫ్యాక్టరీ సమస్య తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తా. నాగావళి, వంశధార నదులను అనుసంధానం చేసి శివారు ప్రాంతాలకు సాగునీరు అందజేసేలా కృషి చేస్తా. విశాఖ నుంచి భువనేశ్వర్ వరకు కోస్టల్ కారిడార్ నిర్మాణానికి కృషి చేసి తద్వారా జిల్లాలో అన్ని రంగాలు అభివృద్ధి జరిగేలా కృషి చేస్తాను గిరిజనులకు మేలు కలిగేలా పాతపట్నం ప్రాంతంలో ఐటీడీఏ ఏర్పాటుకు చొరవ తీసుకుంటాను. జిల్లాలో ప్రధాన రైళ్లు నిలిపేలా కృషి చేస్తాను. వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చేయడమే కాకుండా వలసల నివారణ, ఉద్యోగ కల్పన, విద్యారంగం అభివృద్ధికి మరింత కృషి చేసి జిల్లా రుణం తీర్చుకుంటాను.

ప్రశ్న: వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా అవకాశాన్ని ఎలా భావిస్తున్నారు?

జవాబు: రాష్ట్ర రాజకీయ చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న రాజకీయ విలువలు ఈ దేశానికే ఆదర్శం. ఎటువంటి ఆర్థిక బలం లేని నాకు కేవలం ప్రజాబలాన్ని అంచనా వేస్తూ ఎంతో చరిత్ర కలిగిన శ్రీకాకుళం జిల్లాకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. జిల్లాలో నాయకులు, అన్ని వర్గాల ప్రజలతో సమన్వయం చేసే అనుభవం ఉంది.

టీడీపీని వీడి.. వైఎస్సార్ సీపీలో చేరి..


జలుమూరు: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ధర్మాన కృష్ణదాస్


రణస్థలం: వైఎస్సార్‌సీపీలో చేరిన పోతయ్యవలస బీజేపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


కవిటి:మాణిక్యపురంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ

జలుమూరు: టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. జలుమూరు మండలం మాకివలస పంచాయతీలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అయ్యింది. గ్రామస్తులంతా ఏకమై వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. శుక్రవారం నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి కృష్ణదాస్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అల్లు జయచంద్ర ప్రసాద్, శిమ్మ గోపాల్, బోర రమణ, చల్ల అప్పయ్య, బోర అప్పన్న, కె.రమేష్, చల్ల అచ్యుతరావు, జమ్ము గోపి, అల్లు రాఘవ, శిమ్మ రామ్‌లాల్, జమ్ము రాజు, వెలమల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, మాజీ పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, సర్పంచ్ అల్లు దాలప్పన్న, వెలమల ఆసిరినాయుడు, దామ మన్మధరావు, ధర్మాన రమణమూర్తి, ధర్మాన జగన్ తదితరులు ఉన్నారు.

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ, బీజేపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలం పోతయ్యవలసలో బీజేపీ నుంచి 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో చిలకలపల్లి దామోదరరావు, సిరిలి శ్రీను, సిరిలి సంతు, లావేటి శివ, కొంప్యోళ్ల రామారావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో లావేరు వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, చిలకలపల్లి పరందామయ్య పాల్గొన్నారు.

కవిటి: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం సాధ్యమంటూ మాజీ సర్పంచ్ కేశవసాహూ, టీడీపీ నేత జయసేన్ బిసాయి శుక్రవారం మాణిక్యపురంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరితో పాటు 30 కుటుంబాలకు ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు దేవరాజ్ సాహూ, లలితాసాహూ, సత్యవతి సాహూ, ఢిల్లి మజ్జి, బృందావన్, సంతోష్, కె.శ్రీను, వెంకటరమణ, బ్రహ్మం, హరికృష్ణ, జన్ని గుణో తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం గోవిందపురం పంచాయతీ ఇజ్జాడపాలెంలో టీడీపీ నుంచి 30 కుటుంబాలు వైయస్సార్ సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, మాజీ ఎంపీపీ గొర్లె విజయకుమార్, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షులు బూరాడ చిన్నారావు, బొంతు సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు, లుకలాపు శ్రీను, అలుపన రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో ఎన్ఈఆర్ రచ్చ!



- ల్యాండ్ సీలింగ్ భూముల అన్యాక్రాంతం వివాదం
- భూముల అమ్మకం కోసం చెరువులో రోడ్డు
- దళితులపై దాడులు.. కంకర తవ్వకాలపై ఆరోపణలు
- ఎనిమిదికి పైగా కేసులు నమోదు
- ఎన్నికల వేళ చర్చనీయాంశంగా కూటమి అభ్యర్థి ఈశ్వరరావు వ్యవహారం

పతివాడ పాలెం దాలివాని చెరువులో అక్రమంగా రోడ్డేసిన దృశ్యం(ఫైల్)


దళితులపై దాడి చేసిన ఎన్ఈఆర్‌ను అరెస్టు చేయాలని రణస్థలం జాతీయ రహదారిపై ర్యాలీ చేసిన దృశ్యం(ఫైల్)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : పతివాడపాలెం-తిరుపతిపాలెం మధ్య దళితులకు 20ఎకరాల మేర అసైన్డ్ భూమి ప్రభుత్వం మంజూరు చేసింది. సాగు చేసుకునేందుకు పట్టాలు కూడా ఇచ్చింది. కొంత మంది సాగు చేసుకునేందుకు ఇచ్చారు. అయితే, ఈ భూములను ప్రస్తుత కూటమి అభ్యర్థి నడికుదిటి ఈశ్వరరావు తన గుప్పెట్లోకి తెచ్చుకుని అసలైన యజమానులను మోసం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇటీవల ధర్నాలు కూడా జరిగాయి. ఈ వ్యవహారం కొలిక్కి రాలేదు.

➺ తన భూముల ధర కోసం కోష్ట రెవెన్యూ పరిధిలోని పతివాడపాలెం గ్రామానికి చెందిన దాలివాని చెరువు మీదుగా భారీగా కల్వర్టులు నిర్మించి అక్రమంగా రోడ్డు వేశారు. గతంలో దీనిపై పెద్ద వివాదమే నడిచింది. 'సాక్షి'లో ప్రత్యేక కథనాలు కూడా వచ్చాయి. దీంతో రెవెన్యూ అధికారులు వచ్చి చెరువులోని అక్రమణ తొలగించారు.

➺ కొత్తగా నిర్మించిన తన ప్రైవేటు స్కూల్ కోసం తన స్వగ్రామంలోని కొండతో పాటు అర్జున వలసలోని సంచాం కొండను అక్రమంగా తవ్వేసి గ్రావెల్‌ను తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. 1000కి పైగా లోడ్లు తరలించారని అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది.

➺ నియోజకవర్గంలో దళితులపై దాడులు చేసిన ఎన్ఈఆర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రణస్థలం జాతీయ రహదారిపై దళితులు ర్యాలీ చేసిన వ్యవహారం అప్పట్లో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

➺ ఎన్ఈఆర్‌పై ఎనిమిది కేసులు నమోదైతే అందులో ఆరు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులే. దీని బట్టి దళితులపై ఆయనెంత విశ్వరూపం చూపించారో అర్థం చేసుకోవచ్చు.

ఇంత వివాదస్పద, ఆరోపణలు, ఆక్రమణల చరిత్ర ఉన్న వ్యక్తి కూటమి తరపున ఎన్నికల్లో పోటీ చేయడం చర్చనీయాంశమైంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఆయన గత చరిత్రను గుర్తు చేసుకుంటున్నారు. దౌర్జన్యాలు, అరాచకాలను చూసి భయపడుతున్నారు. అధికారం లేనప్పుడే ఇలా ఉంటే పొరపాటున గెలిస్తే ఇంకెంత రెచ్చిపోతారో అన్న చర్చ నడుస్తోంది. ఎన్నికలంటే అభ్యర్థుల గుణగణాలు చూస్తారు. ప్రజలకు మేలు చేశారా? కీడు చేశారా? అన్నది పరిగణనలోకి తీసుకుంటారు. ఇవన్నీ బేరీజు వేసుకుని ఓటు వేయాలా? వద్దా? అనేది ప్రజలు నిర్ణయం తీసుకుంటారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇప్పుడదే జరుగుతోంది. ఎన్ఈఆర్ తీరుపై ఆలోచన చేస్తున్నారు. ముఖ్యంగా దళితులు మరింత ఆందోళన చెందుతున్నారు. గ్రామ స్థాయి నాయకుడిగా ఉన్నప్పుడే దౌర్జన్యాలు, దాడులు చేస్తే.. అధికారమిస్తే ఇంకేం చేస్తారోనని భయపడుతున్నారు.

పోలింగ్ దగ్గర పడుతున్న కొలదీ ఎన్ఈఆర్ అభ్యర్థిత్వంపై అంతర్మథనం ఎక్కువైంది. తూర్పుకాపులు, కాళింగులు, వెలమలు, మత్స్యకారులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గంలో స్వల్ప ఓట్లు ఉన్న కమ్మ సామాజిక వర్గ నాయకుడికి పెత్తనం అప్పగించడం ఎంతవరకు సమంజసం అన్నదానిపై కూడా ఆలోచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్ఈఆర్‌కు ప్రజలు ఏ రకమైన తీర్పు ఇస్తారో చూడాలి.

అర్ధరాత్రి మద్యం డ్రామా!

శ్రీకాకుళం క్రైమ్ : గార మండలం దీపావళిలో గురువారం అర్ధరాత్రి మద్యం బాటిళ్లకు సంబంధించి హైడ్రామా నడిచింది. ఒడిశాకు చెందిన మద్యం మండలంలోని కీలక పంచాయతీలకు తెలుగుదేశం అభ్యర్థి తరలించారన్న సమాచారం తెలుసుకున్న శ్రీకాకుళం సెబ్ పోలీసులు ఉదయం పది గంటల నుంచి గార మండలంలో తనిఖీలు చేపట్టా. దీపావళిలోని టీడీపీకి చెందిన ఓ కీలక వ్యక్తి రేకుల షెడ్డు, పూరిల్లు (వంటగది)లో భారీ ఎత్తున మద్యం కేసులున్నాయన్న సమాచారం సెబ్ సీఐ గోపాలకృష్ణకు రాత్రి ఎనిమిది గంటలకు వచ్చింది. అయితే పది గంటల వరకు సెబ్ పోలీసులు స్పాట్‌కు వెళ్లకపోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈలోగా సెబ్‌కు చెందిన మరో బృందంలోని సభ్యులు రావడంతో ముందుగా సెంట్రీ కానిస్టేబుల్, మరో పీసీతో కలిసి లొకేషన్‌కు వెళ్లి పావు గంట తర్వాత మిగతా బృందాన్ని పిలిచారు. అప్పటికే డంప్ చేసిన వ్యక్తి కుమారుడు ఫోన్ పట్టుకుని పారిపోవడం, నిమిషాల్లో అక్కడి టీడీపీ సర్పంచ్‌కి ఫోన్‌లో సమాచారం చేరవేయడం..వెనువెంటనే అక్కడికి చేరి పోలీసులతో మాట్లాడటం చకచకా జరిగిపోయాయి. చివరికి అక్కడ ఏమీ లేదంటూ సెబ్ పోలీసులు చేతులెత్తేశారు. దీనిపై స్థానికులు, గార మండల నాయకులు మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఈసీకి ఫిర్యాదు చేస్తారని చెప్పడంతో వెనుదిరిగారు.


మత్స్యకారుల ద్రోహి చంద్రబాబు


మాట్లాడుతున్న మత్స్యకార సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మత్స్యకారులను టీడీపీ ఓటు బ్యాంకుగానే చంద్రబాబు వాడుకున్నారు తప్ప ఏ ఒక్కరికీ సాయం చేయలేదని జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు ధ్వజమెత్తారు. 2017లో పలువురు మత్స్యకారులు పాకిస్థాన్ చెరలో చిక్కుకున్న విషయాన్ని చంద్రబాబుకు చెబితే స్పందించలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పాదయాత్రలో చెప్పడంతో అధికారంలోకి వచ్చిన వెంటనే 22 మంది మత్స్యకారులను పాకిస్థాన్ జైలు నుంచి విడిపించి వారిని కేబినెట్ కుర్చీల్లో కూర్చోబెట్టి రూ.5లక్షలు ఇచ్చి పంపించిన ఘనత జగనన్నదేనని గుర్తు చేశారు. కరోనా సమయంలో ప్రపంచమంతా అల్లాడిపోతుంటే 4500మందికి ఎవరి స్వగ్రామాలకు వారికి తీసుకొచ్చి, మంచి భోజనం, దుస్తులు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ఆ సమయంలో చంద్రబాబు, పవన్‌లు ఎక్కడికి వెళ్లిపోయారని ప్రశ్నించారు. ఎన్నికల వేళే మత్స్యకారులు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు వలసల నివారణకు జిల్లాలో మూలపేట పోర్టు, రెండు ఫిషింగ్‌హార్బర్లు నిర్మాణం చేపట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని స్పష్టం చేశారు. మత్స్యకార భరోసాను రూ.4వేలు నుంచి రూ.10వేలకు పెంచి ఆయిల్‌పై సబ్సిడీని అందించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. అనంతరం మైలపల్లి పోలీస్ మాట్లాడుతూ చంద్రబాబుకు మత్స్యకారుల సమస్యలు చెప్పుకుందామని వెళ్తే తోలుతీస్తా, తోకలు కత్తిరిస్తానని అవమానించారని గుర్తు చేశారు. మన జాతికి మంచిచేసిన ప్రభుత్వాన్ని వదులుకుని మోసం చేసిన వారికి పట్టం కడితే నష్టపోయేది మనమేనని గుర్తించాలన్నారు. మత్స్యకారులంతా వైఎస్సార్‌సీపీకి ఓటేసి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీగా పేరాడ తిలక్‌ని, ఎమ్మెల్యేగా ధర్మాన ప్రసాదరావును గెలిపించుకుందామన్నారు. సమావేశంలో మత్స్యకార సంఘ నాయుకులు సూరాడ సూర్యం, దాసరి పోలయ్య, చీకటి శ్రీరాములు, మైలపల్లి రమణమూర్తి, మోస ఫల్గుణరావు, బర్రి చిన్నారావు, చీకటి గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పరాయి సొమ్ముపై దురాశ

కింజరాపు మైనింగ్ దందా



- ఆగని అచ్చెన్న ఫ్యామిలీ గ్రానైట్ బాగోతం
- దుర్గా భవానీ పాలిషింగ్ యూనిట్‌కు అక్రమంగా బ్లాకుల తరలింపు
- ఒక పర్మిట్‌తో రెండు మూడు లోడ్ల అక్రమ తరలింపు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అచ్చెన్నాయుడుకు 'ప'రాయి' సొమ్ముపై దురాశ తగ్గలేదు. అధికారంలో ఉన్నంత కాలం మైనింగ్ దందా చేశారు. 2014 నుంచి 2019 వరకు చెలరేగిపోయారు. గత ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయినా కూడా వెనక్కి తగ్గలేదు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. కలర్ గ్రానైట్‌ను అక్రమ తరలింపు చేయడమే కాకుండా అడ్డగోలుగా విక్రయాలు జరిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని మైనింగ్ అధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి అచ్చెన్నాయుడు కుటుంబీకులకు చెందిన గ్రానైట్ ఇండస్ట్రీ బండారం బయట పెట్టారు. దీనిపై పక్కా ఆధారాలతో కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 379, 420, 477–ఎ, 406, 120బి, 34ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు కూడా నమోదు చేశారు.



కింజరాపు అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన దుర్గా భవానీ పాలిషింగ్ యూనిట్‌కు అక్రమంగా బ్లాకులు తరలిస్తూ పట్టుబడిన వాహనం

కోటబొమ్మాళి మండలం పెద్ద బమ్మిడి గ్రామంలో సర్వే నంబర్ 106/1,104/9లో టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోదరుడు హరిప్రసాదరావు కుమారుడు సురేష్‌కుమార్ పేరున శ్రీ దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీ ఉంది. 2018 ఏప్రిల్ 23వ తేదీ నుంచి 2038 ఏప్రిల్ 22వ తేదీ వరకు దాదాపు 20 ఏళ్ల మినరల్ డీలర్ లైసెన్సు తీసుకున్నారు. రఫ్ గ్రానైట్ బ్లాక్‌ల కటింగ్, పాలిషింగ్ తదితర కార్యక్రమాలను ఈ ఇండస్ట్రీ చేపడుతుంది. దీంట్లో నాథూరాం చౌదరి, పొన్నాం దాలినాయుడు, పొన్నాం భాస్కరరావు, రావాడ మోహనరావు పార్ట్‌నర్లుగా ఉన్నారు. జిల్లాలో అనేక కలర్ గ్రానైట్ క్వారీల నుంచి గ్రానైట్ బ్లాక్‌లను అధికారికంగా అనుమతి తీసుకుని తమ ఇండస్ట్రీకి రవాణా చేసుకోవల్సి ఉంది. కానీ, అచ్చెన్న కుటుంబీకులకు చెందిన ఈ ఇండస్ట్రీలో అందుకు భిన్నంగా వ్యవహారాలు నడుస్తున్నాయి.

2022 మే 8వ తేదీన వచ్చిన సమాచారం మేరకు కంచిలి మండలం భైరీపురం గ్రామంలోని రానా గ్రానైట్ అండ్ మినరల్ క్వారీ నుంచి గ్రానైట్ బ్లాక్‌లను తరలిస్తున్న వాహనాన్ని(ఏపీ30టీఏ 1089) మైనింగ్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఆ సమయంలో గడువు దాటిన పర్మిట్‌తో అక్రమంగా తరలిస్తున్నట్టుగా తనిఖీ అధికారులు గుర్తించారు. దీంతో సిబ్బంది స్టేట్‌మెంట్ తీసుకుని వాహనం సీజ్ చేశారు. దీనిపై మైనింగ్, విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ జరిపారు. పలాస దగ్గర ఉన్న టోల్ ప్లాజాలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా పట్టుకున్న ఏపీ 30టీఏ 1089 వాహనం నిర్దేశిత ట్రాన్సిట్ గడువు సమయంలో మూడు సార్లు లోడింగ్, అన్‌లోడింగ్‌తో అటు ఇటు వెళ్లినట్టు రికార్డయ్యింది. దీంతో ఒక ట్రాన్సిట్ ఫారంతో రెండు మూడు సార్లు గ్రానైట్ బ్లాక్‌ల అక్రమ తరలింపు జరిగినట్టు నిర్ధారించారు.

ఈ గ్రానైట్ బ్లాక్‌లు రవాణా జరిగిన అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన శ్రీ దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీని, అటు కంచిలిలో ఉన్న గ్రానైట్ క్వారీని పరిశీలించి, విచారణ జరిపారు. దీంతో దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీ బాగోతమంతా బయటపడింది. అధికారుల విచారణను దృష్టిలో ఉంచుకుని అప్పటికప్పుడు గ్రానైట్ బ్లాక్‌ల నంబర్లు దిద్దుబాటు చేయడం, నంబర్ల టాంపరింగ్‌కు పాల్పడటం వంటివి చేశారు. ఇవన్నీ విచారణలో వెలుగు చూశాయి. అంతేకాకుండా ఒకే నంబర్‌తో గల పలు గ్రానైట్ బ్లాక్‌లను గుర్తించారు. అలాగే, ఆన్‌లైన్‌లో ఉన్నదానికి, భౌతికంగా ఉన్న బ్లాక్‌ల నిల్వల తేడాను సైతం పట్టుకున్నారు. 172.87 క్యూబిక్ మీటర్ల బరువైన 23బ్లాక్‌లకు సంబంధించి తేడాలు ఉన్నాయి. ఇవన్నీ గ్రానైట్ క్వారీల నుంచి అక్రమంగా తరలించినట్టుగా తేల్చారు. దీనివిలువ అపరాధ రుసుంతో కలిపి రూ. 6కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. ఇదంతా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం. దాన్ని అచ్చెన్న ఫ్యామిలీ వ్యూహాత్మకంగా గండి కొట్టి దోచుకుంది.

కేసు నమోదు

అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన శ్రీ దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీలో ప్రభుత్వ ప్రాపర్టీ దొంగతనం, టాంపరింగ్, డూప్లికేషన్, ఉన్న స్థితిని మార్చడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని ఆ ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ అచ్చెన్నాయుడు అన్న హరిప్రసాదరావు కుమారుడు సురేష్‌కుమార్, పార్టనర్‌లైన నాతూరాం చౌదరి, పొన్నాం దాలినాయుడు, పొన్నాం భాస్కరరావు, రావాడ మోహనరావుపై కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో శ్రీకాకుళం మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.బాలాజీనాయక్ ఫిర్యాదు చేశారు. దీంతో 379, 420, 477–ఎ, 406, 120బి, 34ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు లెక్కలేనన్ని గ్రానైట్ బ్లాక్‌లను తరలించిన సందర్భాలున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో దుర్గా భవానీ గ్రానైట్‌లో రూ. 11కోట్ల 43లక్షల 29వేల 120మేర అక్రమాలు జరిగాయి. మరో రూ. 3కోట్ల 18లక్షల 72వేల 960మేర జీఎస్టీ చెల్లించకుండా ఎగ్గొట్టారు. అధికారం లేకపోయినా అధికారులు కళ్లు గప్పి అక్రమ రవాణాకు పాల్పడ్డారంటే అచ్చెన్నాయుడు ఫ్యామిలీ ఎంత బరితెగిస్తుందో అర్థం చేసుకోవచ్చు.

కల.. నెరవేరుతోందిలా





మూలపేట వద్ద పోర్టు కోసం నిర్మించిన సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం

- జిల్లాకు తలమానికం మూలపేట పోర్టు
- శరవేగంగా జరుగుతున్న పోర్టు పనులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లా రూపు రేఖలు మారుబోతున్నాయి. సీఎం వైఎస్ జగన్ చొరవతో ఇక్కడి ప్రజల దశాబ్దాల కల త్వరగా నెరవేరబోతోంది. శ్రీకాకుళం తీరానికి మణిహారంగా నిలవనున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. జిల్లాకే కాదు ఉత్తరాంధ్రకు తలమానికంగా నిలిచే మూలపేట పోర్టు పనులు ప్రస్తుతం చకాచకా సాగుతున్నాయి. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.4,362కోట్లతో ప్రాజెక్టు తొలి దశ పనులను వీలైనంత తొందరగా పూర్తి చేసేలా నిర్మాణం వేగవంతం చేసింది. ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం పెరగనుంది. చుట్టు పక్కల ప్రాంతమంతా పారిశ్రామికంగా అభివృద్ధి చెందనుంది.

శరవేగంగా పోర్టు పనులు

సీఎం చేతులమీదుగా శంకుస్థాపన జరిగిన కొన్ని రోజులకే పోర్టు పనులు ప్రారంభమయ్యాయి. సౌత్ బ్రేక్ వాటర్ పనులు, పైలింగ్ ప్రాజెక్టు విస్తరణ పనులు, బెర్తుల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే సముద్రంలోకి సౌత్ వాటర్ బ్రేక్ పనులు 2.4కిలోమీటర్లకుగాను 1110మీటర్ల మేర పూర్తయ్యింది. నార్త్ బ్రేక్ వాటర్ పనులు 580 మీటర్ల మేర పూర్తయ్యాయి. ఈ పనులకు 9లక్షల టన్నుల బండ రాళ్లను వినియోగించారు. బెర్త్‌ల నిర్మాణ పనులకు విదేశాల నుంచి డ్రిల్లింగ్ యంత్రాలను, నిపుణులను తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మొదటి నాలుగు బెర్తుల నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పైలింగ్ పనులు పూర్తయ్యాయి. క్యాటింగ్ యార్డు పనులు జోరుగా జరుగుతున్నాయి. కాంక్రీటు తయారీ కోసం ఏకంగా బ్లాచింగ్ చిప్స్ ప్లాంటు ఏర్పాటు చేశారు. ఒకవైపు పోర్టు నిర్మాణ పనులు చేపడుతూనే మరోవైపు పోర్టు కోసం భూములిచ్చి నిరాశ్రయులైన మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు చెందిన 59 6కుటుంబాలకు రూ. 35కోట్లతో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఒక్కో కుటుంబానికి 5సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మిస్తున్నారు.

రూ. 4,362 కోట్లతో మూలపేట పోర్టు

తూర్పు తీరంలో ఉత్తరాంధ్రలో ప్రస్తుతం విశాఖపట్టణం పోర్టు ఒక్కటి మాత్రమే జల మార్గంలో వ్యాపార లావాదేవీలకు అనుకూలంగా ఉంది. ఆ తర్వాత శ్రీకాకుళం జిల్లా నుంచి ఒడిశా, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లకు జల మార్గంలో అతి తక్కువ దూరం కలిగిన పోర్టు మరొకటి లేదు. దీంతో రాష్ట్రంలో నాలుగు చోట్ల పోర్టులు నిర్మిస్తున్నా అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్న పోర్టుగా మూలపేట పోర్టును ప్రతిష్టాతకంగా వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంది. దానిలో భాగంగా ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ. 4,362కోట్లతో తొలి విడత ప్రాజెక్టు పనులు చేపడుతోంది. వార్షిక సామర్థ్యం 83.3మిలియన్ టన్నులు కాగా, తొలి దశలో 23.5మిలియన్ టన్నుల సామర్థ్యంతో నాలుగు బెర్తుల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతోంది. నాలుగు బెర్తుల్లో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గు, ఇంకొకటి కంటైనర్‌తో పాటు ఇతర ఎగుమతి, దిగుమతులకు వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడ దొరుకుతున్న అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న నీలి గ్రానైట్ తదితర ఖనిజాలు, జిల్లా తీర ప్రాంతంలో లభ్యమవుతున్న లక్షా 95వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద, పలాస జీడిపప్పు, ఒడిశా, చత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన మినరల్ శాండ్, ముడి ఇనుము, సోయామీల్ ఎగుమతులకు ఉపయోగపడుతుంది. థర్మల్ బొగ్గు, కుకింగ్ కోల్, ఎరువులు,ముడి జీడి గింజలు, సున్నపురాయి, వంట నూనెల దిగుమతికి ఉపయోగపడనుంది.



పోర్టు కోసం సముద్రంలోకి వేసిన రోడ్డు



పోర్టు లోపల జరుగుతున్న అభివృద్ధి పనులు

విష్ణు చక్రం నుంచి సాల్ట్ భూముల వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డును వేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్



మొక్కలు నాటుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ శుక్రవారం ఉదయం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన పర్యావరణ సహిత ఓటర్ల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, పలువురికి మొక్కలు అందజేశారు. అనంతరం ఆయన అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందరి చేతిలో ఆయుధం ఓటు అని, 18 ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పోలింగ్ రోజు ఓటు వేయాలన్నారు. 2019 ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగాలని ఆకాంక్షించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ శ్రీకాకుళం బ్రాంచ్ దంత వైద్యులు డాక్టర్ శిల్లా సతీష్ కుమార్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ఊడి సంతోష్ ఆధ్వర్యంలో ర్యాలీని ఆయన ప్రారంభించారు. సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, ఎల్‌డీఎం సూర్య కిరణ్, మెప్మా పీడీ కిరణ్, ఎస్వైకే కోఆర్డినేటర్ ఉజ్వల్, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, స్వీప్ స్వచ్ఛంద సంస్థ కొమ్ము రమణ మూర్తి, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్య చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ మహోత్సవాలు ప్రారంభం

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన నీలమణి దుర్గ అమ్మవారి 49వ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమపూజ, అష్టోత్తర శతనామ పూజ, హోమాలను అర్చకుల బృందం నిర్వహించారు. మొదటి రోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, దీక్షా ధారణ, అగ్ని ప్రతిష్ఠ, అమ్మవారి మూల మంత్ర హోమాలు వేదోక్తంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులకు అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. ఆంధ్రా, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిందే

- టెక్కలి నియోజకవర్గంలో రిగ్గింగ్‌లకు ఆస్కారం కలిగిన పోలింగ్ కేంద్రాలు
- అనాదిగా అక్కడ రిగ్గింగ్ చేస్తున్న టీడీపీ



కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో రిగ్గింగ్‌కు అవకాశం ఉన్న పోలింగ్ బూత్

టెక్కలి: సార్వత్రిక ఎన్నికలు పక్కాగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ పక్కాగా చర్యలు చేపడుతోంది. అయితే టెక్కలి నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని స్థానిక ఓటర్లు కోరుతున్నారు. ఈ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో అనాదిగా టీడీపీ, అందులోనూ కింజరాపు కుటుంబీకులు రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఈ సారి అనుకూలంగా ఓట్లు వేసుకునేందుకు ఇప్పటికే టీడీపీ వర్గాలు క్షేత్ర స్థాయిలో పావులు కదుపుతున్నారు. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం తదితర మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో గత కొన్నేళ్లుగా అదే తంతు జరుగుతోంది. అయితే ఈ సారి ఆయా పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా వేయాలని పలువురు కోరుతున్నారు.

నిఘా పెట్టాల్సిన కేంద్రాలివే..

☛ కోటబొమ్మాళి మండలంలో నిమ్మాడ, వాండ్రాడ, తులసిపేట, పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి, చిన్నవెంకటాపురం, సాలిపేట, అక్కయ్యవలస, చవితిపేట, చిన్నతుంబయ్యపేట, చిన్నవెంకటాపురం, కస్తూరిపాడు, కిష్టుపురం, కొత్తపేట, కురుడు, సొడాం, నరసింగపల్లి, పట్టుపురం, తాటిపర్తి, తిలారు, వీరరాఘవపురం, విశ్వనాథపురం, కోటబొమ్మాళిలో 302 నుంచి 311 తదితర పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక నిఘా వేయాలి.

☛ సంతబొమ్మాళి మండలంలో మూలపేట, చిన్నతుంగాం, పెద్దతుంగాం, కాశీపురం, చెట్లతాండ్ర, ఆరికివలస, అంట్లవరం, కాకరాపల్లి, వడ్డివాడ, జన్నాథపురం, పాలతలగాం, భావనపాడు, బడేకు ప్పన్నపేట, బోరుభద్ర, బృందావనం, జొన్నలపాడు, కాపుగోదాయవలస, కొల్లిపాడు, లక్కివలస, లింగూడు, మర్రిపాడు, పాతమేఘవరం, తాళ్లవలస, ఉమిలాడ, సంతబొమ్మాళిలో 188 నుంచి 194 తదితర పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌లు జరిగే అవకాశం ఉంది.

☛ టెక్కలి మండలంలో భగవాన్‌పురం, చింతలగార, పాతనౌపడ, అయోధ్యపురం, పోలవరం, రావివలస, టెక్కలిలో 97 నుంచి 152 వరకు తదితర పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌లకు అవకాశం ఉంది.

☛ నందిగాం మండలం దొడ్ల రామచంద్రాపురం, కవిటి, దిమిడిజోల, రౌతుపురం, సైలాడ, తమలాపురం, నందిగాంలో 67 నుంచి 69 పోలింగ్ బూత్‌లు, పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌లు జరిగే అవకాశాలు ఉన్నాయి.

☛ సమస్యాత్మక కేంద్రాల్లో వీడియో క్యాస్టింగ్ చేస్తామని ఈసీ ఇప్పటికే చెప్పింది. దీంతో పాటు ఈ కేంద్రాల వద్ద గట్టి భద్రతా చర్యలు కూడా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తప్పుడు ప్రచారం మానుకో చంద్రబాబూ

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



గారలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

గార: ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై తప్పుడు ప్రచారాన్ని చంద్రబాబు మానుకోవాలని, ప్రజలకు క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన శుక్రవారం గార, శ్రీకూర్మం పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. కేంద్రం ఈ చట్టాన్ని నీతి ఆయోగ్ తెచ్చిందని చెబుతున్నా, చంద్రబాబు మాత్రం సిగ్గు లేకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లు వైఎస్సార్ సీపీ అధికారంలో ఉందని, అంతకుముందు టీడీపీ అధికారంలో ఉందని, ఈ రెండు పార్టీల నిబద్ధతను ప్రజలు గమనించాలని సూచించారు. జిల్లాలో మూలపేట పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెడ్డి సామాజిక వర్గానికి భవనం కోసం రెండు ఎకరాలు కేటాయించామన్నారు. శ్రీశయనుల కోసం అనేక పదవులు ఇచ్చామన్నారు. నాయీ బ్రాహ్మణులకు గౌరవంతో పాటు దేవాలయాల్లో సభ్యులుగా నియమిస్తున్నామని తెలిపారు.

ఆశీర్వదించండి..

వైఎస్సార్ సీపీని ప్రజలంతా ఆశీర్వదించాలని, జిల్లాను మరింత అభివృద్ధి చేస్తానని శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా పథకాలు అందించిన నాయకుడు వైఎస్ జగన్ అని తెలిపారు. 2014–19 మధ్యలో పథకాలన్నీ జన్మభూమి కమిటీలు తినేశాయన్నారు. ఈ ప్రభుత్వంలో గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి జనాలకు సంక్షేమం చేరువ చేశామని చెప్పారు. విశాఖ పరిపాలన రాజధాని కావాలని ధర్మాన కోరారని, ఇలాంటి వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. మూలపేట పోర్టుతో పాటు కిడ్నీ ఆస్పత్రి, ఉద్దానంకు మంచినీటి ప్రాజెక్టు అందించారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, మార్పు ధర్మారావు, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, సర్పంచ్ గోరు అనిత, వైస్ ఎంపీపీ అందవరపు బాలకృష్ణమూర్తి, బొడ్డేపల్లి పద్మజ, మార్పు పృథ్వీరాజ్, ముంజేటి కృష్ణమూర్తి, జల్లు రాజీవ్, ఆరంగి రమణమూర్తి, పుల్లటి నాగేశ్వరరావు, పీస గోపి, మార్పు మన్మథరావు, ఆరంగి రాంబాబు, పుల్లటి శశిభూషణరావు, ఎంపీటీసీలు ఊట అప్పలనాయుడు, కురమాన మునెమ్మ, ఉప్పాడ ఆదిలక్ష్మి, బరాటం నాగరాజు, పల్ల రాధాకృష్ణ, అనుపోజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్‌సీపీ విజయమే మా లక్ష్యం'



వైఎస్సార్‌సీపీకి మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పేద ప్రజలకు అన్ని రకాల పథకాలు అందించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీకి మరో సారి పట్టం కట్టాలని న్యాయవాదులంతా కోరారు. శ్రీకాకుళం నగరంలో వారంతా శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదర రావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్, జిల్లాలో మంత్రి ధర్మాన, ఎంపీగా పేరాడ తిలక్ మనకు అవసరమన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమానంగా జరగాలంటే వైఎస్సార్‌సీపీతోనే సాధ్యపడుతుందన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు దుష్ప్రచారం సరికాదని, ప్రజలంతా వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కో ఆర్డినేటర్ గేదెల వాసుదేవరావు, కార్యదర్శులు పొన్నాడ వెంకటరమణ, ఆరంగి లక్ష్మీ పతి, సీనియర్ న్యాయవాది, నౌపాడ విజయ్ కుమార్, జీవ రత్నం, సంపత్ కుమార్, పొన్నాడ రుషి, కృష్ణంరాజు, అప్పలరాజు, సీనియర్, జూనియర్ లీగల్ సెల్ న్యాయవాదులలతో పాటు లీగల్ సెల్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి ఏర్పాట్లు



రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు పరిశీలిస్తున్న శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా



శివానీ కళాశాల బయట రోడ్ల నిర్మాణం



ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రం



పార్కింగ్‌కు కేటాయించిన స్థలం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మరో పక్క స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను కళాశాలలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా శుక్రవారం పర్యవేక్షించారు. ఎన్నికల పరిశీలకుల సూచన మేరకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా రిసెప్షన్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. పోలింగ్ ముగిశాక 13వ తేదీ రాత్రి వేళ బస్సుల్లో ఈవీఎంలు రిసెప్షన్ కేంద్రాలకు తరలిస్తారు. రిసెప్షన్ కేంద్రాల నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. ప్రధానంగా జాతీయ రహదారి నుంచి కళాశాల వెలుపల నుంచి రోడ్లు నిర్మిస్తున్నారు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలు కళాశాలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. గత ఎన్నికల్లో పెద్ద ఎత్తున జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అలాంటి పరిస్థితులు రాకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో సాగుతున్నారు.

యామలపేటలో జీడితోట దగ్ధం



దగ్ధమైన జీడితోటలో రైతు ఆనందరావు

సంతబొమ్మాళి: మండలం యామలపేటలో శుక్రవారం విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా సుమారు రెండు ఎకరాల జీడితోటలు దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన రైతు గద్దాయి ఆనందరావు జీడితోటపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు ఒకదానికికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో అవి జీడి తోటల్లో పడి మండలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్న కుద్ది హేమారావు, సాహుకారి యమున, దుర్గాప్రసాద్, ఎం.దానయ్య, సాహుకారి ప్రసాద్‌లకు చెందిన జీడి తోటలు ఒక్క సారిగా అంటుకున్నాయి. జీడి పంట చేతికొచ్చే సమయంలో ప్రమాదం జరగడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు లబోదిబోమంటున్నారు. సుమారు రెండు ఎకరాలు విస్తీర్ణంలో అగ్ని ప్రమాదం జరిగిందని ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.